క్లుప్తంగా

మట్టి తవ్వకాలపై గ్రామస్తుల నిరసన

మధిర: మండలంలోని ఆత్కూరు చెరువు సమీపంలో ఒక వ్యక్తి మట్టి తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్యారామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. చెరువుకు సమీపంలో పొలం కలిగి ఉన్న ఒక వ్యక్తి మట్టి తవ్వకం చేపడుతుండడం వల్ల చెరువుకు ముప్పు ఉంటుందని గ్రామ సర్పంచ్ తెలిపారు. వర్షాకాలంలో చెరువు కట్ట తెగిపోయి జనావాసాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. జేసీబీతో జరుగుతున్న పనులను అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంపై మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బీజేపీ నేత అప్పారావు?



కిష్టారంలో సమావేశమైన అప్పారావు అనుచరులు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలానికి చెందిన బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఉడతనేని అప్పారావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఆయన చర్చించినట్లు సమాచారం. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోగా, నాయకులు సహకరించని విషయమై అధిష్టానం స్పందించలేదని బీజేపీలో చేరారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకుని ఆదివారం తన అనుచరులతో మండలం కిష్టారంలో సమావేశమయ్యారు. కాంగ్రెస్‌లో చేరితేనే భవిష్యత్ ఉంటుందని అనుచరులు కోరడంతో అటే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

నేత్రదానం ఎంతో గొప్పది

మధిర: నేత్రదానం ఎంతో గొప్పదని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరపు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇల్లూరు గ్రామానికి చెందిన అహల్యాదేవి మృతిచెందడంతో నేత్రాలను, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు దానం చేసి ఇరువురుకార్నియా అంధులకు చూపు వచ్చేందుకు సహకరించిన దాత కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అహల్యా దేవి పార్థివ దేహాన్ని మమత వైద్యకళాశాలకు బోధన అవసరాల కోసం అప్పగించారు.

పాలడుగులో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలో పాస్టర్ మోదుగు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ అంబిక హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ రెడ్డెం నాగసర్సిరెడ్డి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు పలు రకాల వైద్య పరీక్షల నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం రమాదేవి, కార్యదర్శి గరికపాటి కుమార్, వై. ప్రసాద్‌రావు, వైద్యులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని వెంగళరావునగర్ కాలనీ సుమారు 180 కుటుంబాలకు నవ చైతన్య సంస్థ, ఆశ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అదే విధంగా సంస్థ డైరెక్టర్ మాదిరాజు పుల్లారావు మాట్లాడుతూ.. ఏడో తరగతిలో ప్రతిభ చూపిన కాలనీలోని విద్యార్థులకు తన తల్లిదండ్రులు మాదిరాజు రాఘవరావు, సీతాదేవి జ్ఞాపకార్థం రూ.5 వేలు నగదు ప్రోత్సాహ బహుమతి అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నర్సింహారెడ్డి, కిరణ్, సురేష్, శ్రీనివాసరావు, మోహన్, వీరాస్వామి, మనోహర్, సుమన్, మారేష్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారం

ఏన్కూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎండీ ముజాహిద్ తెలిపారు. బదిలీపై వచ్చిన తహసీల్దార్ ముజాహిద్ స్థానిక కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి భూ సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు.

భరోసా ఏదీ..?

- వృత్తి ఉనికిని కోల్పోతున్న గౌడన్నలు
- పూర్తిస్థాయిలో అందని సంక్షేమ పథకాలు
- ఆవేదన చెందుతున్న గీతకార్మికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తాతలు.. తండ్రులు వారసత్వంగా వచ్చిన గీత వృత్తిని నమ్ముకుని ఎంతో మంది కార్మికులు కుటుంబాలను పోషిస్తున్నా గౌడన్నలకు సరిగా ఆదరణ లేకుండా పోయింది. ఈత, తాటి చెట్ల నుంచి సహజ సిద్ధమైన కల్లును సేకరించి గ్రామాల్లో విక్రయించి ఉపాధి పొందుతున్నారు. వారికి పలు సందర్భాలల్లో ప్రమాదవశాత్తు చెట్టుపైనుంచి కిందపడితే అరకొర నష్టం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. వారిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఎన్నో రోడ్డుపై పడుతున్నాయి. వయస్సు పైబడిన వారికి కల్లు విక్రయించడం ఎంతో సాహసంతో కూడుకున్న పనిగా మారింది.



బాణాపురంలో తాటిచెట్టు ఎక్కుతున్న కల్లుగీత కార్మికుడు

ముదిగొండ: గీత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాలు కోకొల్లలున్నాయి. తమ ఖష్టార్జితంపై ఇల్లు, తమ పిల్లల చదువులు, ఖర్చులు అన్ని గీత వృత్తిలోనే వెళ్లదీసుకుని బ్రతుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత తమ వృత్తిపరమైన సంక్షేమాలు అందుతాయని ఎదురు చూసిన గీతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఆదుకునే నాధుడే కరువైయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గీత వృత్తిని నమ్ముకున్నవారికైనా ప్రభుత్వం గీతబందు పథకం ఇచ్చి గౌడన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు.

సొసైటీలో కార్మికులు 3,900 మంది..

నేలకొండపల్లి ఆబ్కారీ శాఖ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లోని 44 సొసైటీలున్నాయి. వీటిలో మొత్తం గీత కార్మికులు 3,900 మంది గీత కార్మికులు ఉన్నారు. ప్రతి ఏటా తాటి, ఈత చెట్లపైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయాలు పాలైనవారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. చనిపోయినవారు ఏటా ముగ్గురు, నలుగుఉ ఉంటున్నారు.

అరకొరగా అందుతున్న ప్రభుత్వ పథకాలు..

మూడు మండలాల్లో సభ్యత్వం కలిగిన వారిలో పింఛన్‌దారులు సగం మంది ఉంటే.. 50సంవత్సరాలు దాటిన మిగిలిన సగం మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారు. ప్రభుత్వం ఇదివరకు ప్రమాద బాధిత గీత కార్మికులకు రూ.10 వేలు, మరణించిన వారికి రూ.5 లక్షలు, బీసీలకు రూ.లక్ష రుణాలు అందజేస్తున్నట్లు ప్రకటనలు చేసింది. అందులో కొన్ని గౌడ, పద్మశాలి, ముదిరాజ్, గొల్లకురుమ, మున్నూరుకాపు బీసీ సంఘాల ప్రస్తావనే లేదు. అధికారులు ప్రతి ఏటా గౌడ సంఘస్తులకు ఈత, తాటి విత్తనాలు ఇచ్చి నాటుకొమ్మని చెపుతున్నారు. కానీ వాటిని పెంచడానికి స్థలాలు, వనాలు లేక గీత వృతి సన్నగిల్లుతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలంటూ సంబురాలు జరుపుతున్న ప్రభుత్వంపై కొన్ని బీసీ సంఘాలు అర్హులైన వృత్తిదారులకు బరోసా కల్పించలేదని విరుచుకుపడుతున్నారు. సరైన స్కీంలు అమలు పరిచి నిరుపేదలైన వృత్తిదారులను ఆదుకోవాలని కల్లుగీత కార్మికులు, బీసీ సంఘాలు కోరారు.

వృత్తిని నమ్ముకుని 30 ఏళ్లు..



గత ముప్పై ఏళ్లుగా గీతవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నా. మాకు కూడా ప్రభుత్వం గీతబందును అందించి ఆదుకోవాలి. బీసీ రుణాలు కూడా అందని మాకు, కొన్ని బీసీ కులాలకు రెండు, మూడు సార్లు రుణాలు అందజేయడం, మాలాంటి వారిని గుర్తించకపోవడం చాలా దురద్రుష్టకరం. ఇకనైనా మాకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

– గడ్డం కుమారస్వామి గౌడ్, న్యూలక్ష్మీపురం సొసైటీ అధ్యక్షుడు

పింఛన్ రూ.6వేలు ఇవ్వాలి..



వృత్తి పరంగా కల్లుగీసుకుని జీవనం సాగించే మాకు కనీసం పింఛన్ రూ.6వేలు ఇవ్వాలి. బీసీలకు ఇచ్చే రుణాలలో గీత వృత్తిదారులను గుర్తించి, రుణాలు అందించాలి. తాటి, ఈత వనాలు పెంచడానికి ప్రభుత్వం భూమిని సర్వే చేసి ఇవ్వాలి. చేతి వృత్తిదారులందరికీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

– బెందు వెంకటేశ్వర్లు గౌడ్, కల్లుగీత కార్మికుడు, బాణాపురం

ఘనంగా కవి సమ్మేళనం

సత్తుపల్లిటౌన్: తెలుగు భాషను మరిచిపోతున్న నేటి సమాజంలో తెలంగాణ ప్రభుత్వం కవుల సమ్మేళనం నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సత్తుపల్లిలో కవి సమ్మేళనం నిర్వహించారు. కలం, గళంతో పోరాడిన సాహితీ మూర్తులను స్మరించుకుంటూ తెలంగాణ ఉద్యమకారులను గౌరవించటం గర్వకారణంగా ఉందన్నారు. ఉద్యమకారుడే ముఖ్యమంత్రి కావటంతో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. దేశంలో అభివృద్ధి చెందిన పట్టణాలు, పంచాయతీల అవార్డులు తెలంగాణ రాష్ట్రానికే ఎక్కువగా దక్కాయంటే ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. అనంతరం కవులు బి.మధుసూదన్‌రాజు, జి.రామకృష్ణ, మల్లికార్జున్‌రావు, కల్యాణశర్మ, మాదిరాజు మాలతి, గట్టే వాసు, పల్లం పిచ్చయ్య, సాగర్‌లతో పాటు ఉద్యమకారులు బండి అంజిరెడ్డి, అయూబ్ పాషా, చీపు జగదీష్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ సుజాత, కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, చల్లగుండ్ల కృష్ణయ్య, కూసంపూడి రామారావు, మట్టా ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమకారులు, కవులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నీటిమూటలుగా ఎన్నికల హామీలు



మాట్లాడుతున్న వెంకట్

మధిర: ఎన్నికల వేళ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, ఆ తర్వాత ప్రజలను వచించడం రాజకీయ పార్టీలకు అలవాటైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బోడ వెంకట్ అన్నారు. మధిర మండలంలోని మల్లవరం గ్రామంలో సర్పంచ్ ఉపేంద్ర అధ్యక్షతన శనివారం రాత్రి సీపీఎం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను విస్మరించడం వల్ల పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ రంగ సంక్షోభాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలు సొంతింటి కల నెరవేరాలంటే కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక మార్కెట్లలో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలడుగు భాస్కర్, శీలం నరసింహారావు, మందా సైదులు, మద్దాల ప్రభాకర్, షేక్ ఉద్దండు సాహెబ్, నాయుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో గ్రామస్తుల విరాళాలతో నిర్మించిన దేవాలయంలో ఆదివారం సమ్మక్క, సారలమ్మ, ఎల్లమ్మ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు వేడుకగా జరిగాయి. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పురవీధుల్లో ఆలయ అర్చకులు వెదురు నాగిరెడ్డి ఆధ్వర్యంలో.. ఊరేగింపు కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించుకున్నారు. ఈ నెల 12న ఉదయం 9:45 గంటలకు సమ్మక్క, సారలమ్మ, ఎల్లమ్మ తల్లుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ పూజారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



అయ్యవారిగూడెంలో దేవతామూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రావోజితండాలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు

కారేపల్లి: మండలంలోని రావోజితండా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు గుండు రామచంద్రమూర్తి, సురేష్ శర్మల ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దంపతులు పీటల మీద కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా.. కుంకుమార్చన, మహిళా భక్తులు ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు ఊరిపొలిమేరలో గ్రామ దిగ్బంధన కార్యక్రమాలను గ్రామస్తులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ బానోత్ పద్మామోహన్, గ్రామ పెద్దలు లక్ష్మణ్, హాము, కిషన్, రాంబాబు, రమేష్, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కనకదుర్గా విగ్రహ పునఃప్రతిష్ఠ యాగం



కనకదుర్గ అమ్మవారి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బోనకల్: మండల కేంద్రంలోని ఆళ్లపాడు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నందు నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గ రేణుక ఎల్లమ్మ అమ్మవార్ల ఆలయ, విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకల సందర్భంగా ఆదివారం యాగం నిర్వహించారు. ఈ యాగంలో దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ బీపీ నాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వల్లభిలో బోనాల జాతర



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ముదిగొండ: మండలంలోని వల్లభిలో ఆదివారం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా కంఠమహేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని వనంమైసమ్మ, యల్లమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వల్లభిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠాపన జరిగి 16రోజులు అయిన సందర్భంగా పూజలు నిర్వహించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

సత్తుపల్లి: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ రూ.4116లు పెంచిన సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆదివారం సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులపట్ల తెలంగాణ ప్రభుత్వం ఉన్నతంగా ఆలోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ సుజాత, కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వాసు, కృష్ణయ్య, రామారావు, ప్రసాద్, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీసీ కుల వృత్తిదారులు, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు మాట్లాడారు. బీసీ కులాల్లోని చేతి వృత్తిదారులకు లక్ష రుపాయలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ శిరీష, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

కల్లూరు: కల్లూరులోని నూతన బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. 60 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా కల్లూరు పట్టణానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై ఐలూరి రామకృష్ణారెడ్డి తన తల్లిదండ్రులు సీతారామిరెడ్డి, వెంకట్రావమ్మ ల జ్ఞాపకార్థం మజ్జిగ ప్యాకెట్లను ప్రయాణికులకు అందించారు.

ప్రజాగర్జనకు తరలిన సీపీఐ శ్రేణులు



చింతకాని నుంచి తరలివెళ్తున్న సీపీఐ శ్రేణులు

చింతకాని/బోనకల్: కొత్తగూడెంలో జరుగుతున్న ప్రజాగర్జన సభకు ఆదివారం మండలంలోని సీపీఐ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలల్లో సీపీఐ జిల్లా నాయకులు ఏపూరి రవీంద్రబాబు, పగిడిపల్లి ఏసు, కూచిపూడి రవి, సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, నాయకులు మోహన్‌రావు, శ్రీను, రమేష్, రోషన్‌కుమార్, రామాంజనేయులు, పవన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఆర్వోబీ



ప్రమాదభరితంగా మారిన ఆర్వోబీ రెయిలింగ్

బోనకల్: మండల కేంద్రంలోని ఆర్వోబీ బ్రిడ్జిపై రెయిలింగ్ దెబ్బతిని సువ్వలు బయటపడ్డాయి. రెయిలంగ్ పక్కన ఉన్న సిమెంట్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని బ్రిడ్జి కింద భాగానికి పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ప్రమాదానికి గురైతున్నారు. సువ్వలు టైర్లకు గుచ్చుకొని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు మిర్చి మార్కెట్ ప్రారంభం

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి మిర్చి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక శ్రేణి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన పంటలను మార్కెట్‌కి తీసుకొని వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు.

నేడు వైరాలో 2కే రన్..

ఏన్కూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12న వైరాలో 2కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్సై బాదావత్ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు జరిగే 2కే రన్ కార్యక్రమానికి మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సుదర్శనం

కల్లూరు: ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేయాలని తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సుదర్శనం పేర్కొన్నారు. ఆదివారం ఎన్నెస్పీలోని యూతఏం చర్చిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం మంచి మనస్సుతో పరిష్కరించాలన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభించిన క్రిష్టియన్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో క్రైస్తవులకు శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని, క్రైస్తవుల గృహాల్లో జరిగే కల్యాణ మహోత్సవాలకు, ఇతర శుభకార్యాలకు కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు క్రైస్తవ బోధకులపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అన్ని మతాలను గౌరవించాలని సూచించారు.

జేవీఆర్‌లో ఉష్ణోగ్రతపై అధ్యయనం

సత్తుపల్లిటౌన్: వృక్షాల నీడ వేసవిలో ఉష్ణోగ్రతను తగ్గిస్తాయని సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. 'వేసవి ఉష్ణోగ్రత్తలపై వృక్షాల నీడ శాతం – ప్రభావాలు'అంశంపై వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు ఆదివారం అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వృక్షాల నీడ దాదాపు 12,289 చ.మీ. మేర వ్యాపించి ఉండగా ఉష్ణోగ్రత తక్కువగా నమోదవుతుందన్నారు. సత్తుపల్లిలో ఆదివారం 41డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కళాశాలలో మాత్రం 38 డిగ్రీలే ఉందని తెలిపారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు వీరిని అభినందించారు.



ఉష్ణోగ్రతలపై అధ్యయనం చేస్తున్న విద్యార్థులు

గ్రూప్–1 పరీక్ష ప్రశాంతం



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు

కొణిజర్ల: మండలంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల, గ్రేస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. గ్రేస్ జూనియర్ కళాశాలలో 206 మందికి గానూ 131 మంది పరీక్షకు హాజరైనారు. విజయ ఇంజనీరింగ్ కళాశాలలో 480 మందికి గానూ 301 మంది హాజరైయ్యారు. వైరా ఏసీపీ యంఏ రెహమాన్ నేతృత్వంలో వైరా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్‌లు స్నేహలత మొగిలి, మధుసూధనరావులు పరిశీలించారు.

సాగుతున్న బడిపనులు..

- నేటి నుంచి మోగనున్న బడిగంట

సత్తుపల్లిటౌన్: పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. గతేడాది సత్తుపల్లి మండలంలో 23 పాఠశాలలను బడిబాటలో పనులు చేపట్టారు. మూడు పాఠశాలలు మాత్రమే పనులు పూర్తి చేసుకొని ప్రారంభమయ్యాయి. ఇంకా 10 పాఠశాలల్లో పనులు పూర్తి అయినప్పటికీ రంగులు వేయకపోవటంతో అసంపూర్తిగా ఉన్నాయి. మరో పది పాఠశాలల్లో ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. పట్టణంలోని వెంగళరావునగర్ పాఠశాల శిథిలావస్థలో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల బడిబాటలో ఎంపిక కాక పోవటంతో మరమ్మతులకు నోచుకోక పోవటంతో అధ్వానంగా ఉంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కల్లా బడిబాట పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో అందిస్తామని అధికార యంత్రాంగం చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం విఫలమయ్యారని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న మడుపల్లి భాస్కర్

చింతకాని: మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన మడుపల్లి పెద్దవెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారుడు మల్లేష్ తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీను, లక్ష్మీపతి, బుజ్జి, గ్రామపెద్దలు సోందు, మేడగాని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడికి..

పెనుబల్లి: కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. మండల పరిధిలోని యడ్లబంజర్ గ్రామానికి చెందిన సుంకర నరేష్ వీయంబంజర్ నుంచి యడ్లబంజర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో పెనుబల్లి, యడ్లబంజర్ గ్రామాల మార్గమధ్యలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడికి..

కల్లూరురూరల్: ఆగి ఉన్న లారీని ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా.. పెనుబల్లి మండలం గణేష్‌పాడుకు చెందిన వంట మేస్త్రి జానపాటి నాగరాజు తన ద్విచక్ర వాహనంపై శనివారం అర్ధరాత్రి సమయాన కల్లూరు నుంచి తిరువూరు వెళ్తున్నాడు. ఈక్రమంలో పేరువంచ వద్ద ఎలాంటి సిగ్నల్స్ లేకుండా నిలిపి వేసిన లారీని బైక్‌ను ఢీకొట్టడంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తిరువూరు ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు. నాగరాజు మామ బోసు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసుల లారీ డ్రైవర్ గోపాల్‌సింగ్‌పై ఆదివారం కేసు నమోదు చేశారు.